క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక



ఖానాపురం : మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా వీఓ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తూడి ప్రభావతి, ఉపాధ్యక్షురాలిగా దేవినేని జ్యోతి, కార్యదర్శిగా జ్యోతుల వనజ, సహాయ కార్యదర్శిగా నీలం లావణ్య, కోశాధికారిగా బండారి స్వప్న ఎన్నికయ్యారు. అనంతరం పాత కార్యవర్గంతోపాటు కొత్తగా ఎన్నికైన కమిటీ బాధ్యులను సన్మానించారు. కార్యక్రమంలో సీఏ కోనేరు శ్రీదేవి, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన కుండే సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆదర్శ కాలనీ ప్రతినిధులు ఆదివారం రూ.11 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పేద దళితుల వైద్యానికి..



గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన పేద దళితులు నల్ల సరోజన, మాదాసి స్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా వారికి వైద్యం కోసం స్థానిక హైస్కూల్‌లో గతంలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన ముత్తినేని జయలక్ష్మి తన తండ్రి మనోహర్‌రావు జ్ఞాపకార్థం ఫాదర్స్ డే సందర్భంగా ఆదివారం రూ.5 వేల సాయం అందజేశారు. జయలక్ష్మి డబ్బు పంపించగా సరోజన, స్వామిలకు కర్ణకంటి రామ్మూర్తి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మాదాసి రాంబాబు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఊకల్‌లో..



గీసుకొండ : మండలంలోని ఊకల్‌కు చెందిన మండల సాంబయ్య కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి తరఫున ఆ పార్టీ నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీరగోని రాజ్‌కుమార్, మాదాసి రాంబాబు, కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజ్‌కుమార్, కక్కెర్ల సుభాష్, మండల నరేశ్, నకినబోయిన నాగరాజు, నర్సింగరావు, కుమారస్వామి, రాజు, మల్లేశ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



పర్వతగిరి : మాజీ ఉపసర్పంచ్ మట్ట కుమారస్వామి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రాములు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాడుగుల రాజు, నాయకులు సర్వర్, గోనె సంపత్, కొండ వెంకన్న, గడ్డి యాకన్న, బండి సంతోశ్, నోముల రమేశ్, అదొండ భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు తరలించాలి

ఐనవోలు : మండల కేంద్రం సమీపంలో గోవధ కోసం అక్రమంగా నిర్బంధించిన 37 గోవులను తక్షణమే గోశాలకు తరలించాలని విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను కోరారు. మండలానికి చెందిన విశ్వహిందు పరిషత్ నాయకులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా విశ్వహిందు పరిషత్ ప్రతినిధి ఉదయ్ శ్రీరామ్ అక్కడకు చేరుకుని 37 ఆవులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎస్సైకి, మామునూరు ఏసీపీకి వీహెచ్‌పీ నాయకులు సమాచారం అందించారు. ఆవులను నిర్బంధించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆగస్టు 26 నుంచి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన

ఖిలా వరంగల్: ఆగస్టు 26 నుంచి 28వ తేదీ వరకు వరంగల్‌లోని శివశక్తి వినాయక మందిరంలో శివలింగం, వినాయక, నందీశ్వర, విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు నల్లకుంట రవికుమార్, దేవేందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపనను ఆగస్టులో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారు. దాతలు సిద్దం రాము, కార్పొరేటర్ ఉమ, శ్యామ్, నల్లకుంట రవికుమార్, డాక్టర్ రమేశ్, రామ్మోహన్‌రావు రూ.25 వేల చొప్పున విరాళం ఇచ్చేందుకు ముందుకొచ్చారు.

రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం

● 2023లోనే నిధులు మంజూరు

దుగ్గొండి : మండలంలోని వివిధ గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఎఫ్‌డీఆర్, ఎంఆర్‌ఆర్ గ్రాంట్ల కింద 2023లో నిధులు మంజూరు చేసింది. అదే ఏడాది మార్చిలో టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. కాంట్రాక్టర్లు ఏడాదిన్నరగా పనులు చేయకపోతుండడంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రూ.4.50 కోట్ల ఎఫ్‌డీఆర్ నిధులు

మండలంలో వరదలకు కొట్టుకుపోయిన రోడ్ల నిర్మాణం కోసం ఫ్లడ్ డ్యామేజీ రోడ్ (ఎఫ్‌డీఆర్) ఫండ్ నుంచి ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నాడు. అందులో రూ.90 లక్షల విలువైన పనులు మాత్రమే పూర్తి చేశారు. చంద్రయ్యపల్లి రూ.20 లక్షలు, మహ్మదాపురంలో రూ.50 లక్షలు, మల్లంపల్లిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. నాచినపల్లిలో రూ.60 లక్షలు, రాజ్యతండా రూ.15 లక్షలు, అడవి రంగాపురంలో రూ.15 లక్షలు, లక్ష్మీపురంలో రూ.40 లక్షలు, దుగ్గొండిలో రూ.30 లక్షలు, బంధంపల్లిలో రూ.30 లక్షలు, ముద్దునూరులో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు పోయాల్సి ఉంది. పొనకల్ నుండి రేబల్లె వరకు రూ. 1.20 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. గడువు మరో 4 నెలలు ఉంది. గడువులోగారోడ్లు నిర్మించకపోతే నిధులు మురిగిపోతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రూ.6.50 కోట్ల ఎంఆర్‌ఆర్ నిధులు

వెంకటాపురం–మహ్మదాపురం–రాజేశ్వర్‌రావుపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.30 కోట్లు మంజూరు చేయగా కాంట్రాక్టర్లు రోడ్డుపై కంకర వేసి రోలింగ్ చేసి వదిలేశారు. ఏడాది గడచినా బీటీ వేయకపోవడంతో ఆ రోడ్డుపై ప్రయాణం కష్టంగా మారింది. చలపర్తి మార్క్‌ఫెడ్ గోదాముల నుంచి తిమ్మంపేట బీటీ రోడ్డు వరకు రూ.45 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా కాంట్రాక్టర్ కేవలం దొడ్డు కంకర వేసి వదిలేశారు. ఆ రోడ్డుపై నడక సైతం కష్టంగా మారింది. రేకంపల్లి క్రాస్ నుంచి తిమ్మంపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1.75 కోట్లు మంజూరు కాగా ఆ రోడ్డు నిర్మాణాన్ని సైతం కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపేశాడు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా మంత్రులు, ఎమ్మెల్యే చొరవ తీసుకుని రోడ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



మార్క్‌ఫెడ్ గోదాముల నుంచి తిమ్మంపేట బీటీ రోడ్డు వరకు పోసిన కంకర

కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చాం

ఎఫ్‌డీఆర్ నిధులతో మండలంలోని కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశాము. మరో 7 గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాల్సి ఉంది. త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. అయినా ఆలస్యం చేస్తుండటంతో నోటీసులు ఇచ్చాం. పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్ల నిర్మాణాలను త్వరలో పూర్తి చేయిస్తాం.

–ఇజ్జగిరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పీఆర్ శాఖ

నీట్‌లో ప్రతిభ.. విద్యార్థినికి సన్మానం



కరుణదీప్‌ను సన్మానిస్తున్న నాయకులు

నర్సంపేట : నర్సంపేటకు చెందిన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ కూతురు కరుణ దీప్ ఆలిండియా నీట్‌లో ప్రతిభ చాటి మెరుగైన ర్యాంక్ సాధించగా ఆమెను విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏబీఎస్‌ఎఫ్, ఏఐఎస్‌ఎఫ్, ఎంఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు కరుణ దీప్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేశ్ మాట్లాడారు. కరుణ దీప్ నీట్‌లో 720కి గాను 526 మార్కులు సాధించి ఆల్ ఇండియా ఎస్సీ కేటగిరీలో 499వ ర్యాంకు సాధించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతం సిద్దు, సదిరం వినయ్, ఉషాకిరణ్, రవిప్రకాశ్, విష్ణుకుమార్, శ్రీధర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాల్ట్రీఫారం ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన



పోస్టుకార్డులతో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ, తండావాసులు

రాయపర్తి : కోళ్లఫారం ఏర్పాటును వ్యతిరేకిస్తూ మండలంలోని పన్యానాయక్‌తండా వాసులు ఆదివారం పోస్టుకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడారు. పౌల్ట్రీఫారం నిర్మిస్తే తండావాసులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ క్రమంలోనే పౌల్ట్రీఫారం ఏర్పాటును మానుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అయినా నిర్వాహకుడు పౌల్ట్రీఫారం ఏర్పాటును మానుకోకపోవడంతో కలెక్టర్‌కు పోస్టుకార్డులు రాసి పంపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భూక్య క్రాంతి నాయకులు మాలోతు దేశిరాం, భూక్య రాజారాం, భూక్య రవి, కిషన్, శంకర్, దేవ్లా, లక్పతి, గోపాల్, బుచ్చన్న, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అన్వేశ్

సంగెం : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అన్వేశ్ అనంతుల కోరారు. మండలంలోని కాపుల కనపర్తిలో వరంగల్ నగరానికి చెందిన సన్‌లైఫ్ హాస్పిటల్స్ ప్రతినిధులు ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వేశ్ వృద్ధులకు, గ్రామస్తులకు బీపీ, షుగర్, థైరాయిడ్, రక్త పరీక్షలు నిర్వహించి పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. తద్వారా అనారోగ్యం నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి 'విద్యుత్' గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలి

నర్సంపేట : నేడు (సోమవారం) నిర్వహించనున్న విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలని ఆ శాఖ నర్సంపేట డీఈ ఆర్.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నర్సంపేట డివిజన్ పరిధిలోని సెక్షన్ ఆఫీస్, ఈఆర్‌ఓ, సబ్ డివిజన్ ఆఫీస్, నర్సంపేట డివిజన్ ఆఫీస్‌ల్లో ప్రతీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ప్రజావాణిలో చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అద్దంకికి సంస్కృతి సాహితీ జాతీయ పురస్కారం

ఐనవోలు : ఎండోమెంట్ శాఖ కార్యనిర్వహణ అధికారి అద్దంకి నాగేశ్వర్‌రావుకు తెలంగాణ సంస్కృతి సాహితి జాతీయ పురస్కారం లభించింది. తెలంగాణ సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ తెలంగాణ, ఏపీ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే నాగరాజు పురస్కారం అందించారు. ఆధ్యాత్మిక సేవా రంగంలో సేవ అందిస్తున్న నాగేశ్వర్‌రావు దంపతులకు స్వర్ణనంది ప్రధానోత్సవంతోపాటు కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎం.గౌరిశంకర్ తెలిపారు. పలు రాష్ట్రాల్లో ట్రస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ తనకు పురస్కారం అందించడం గర్వంగా ఉందని అద్దంకి నాగేశ్వర్‌రావు అన్నారు.

అక్రమంగా వారసత్వ పట్టా మార్పిడి



చెన్నారావుపేట : అక్రమంగా వారసత్వ పట్టా మార్పిడికి మండల రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారన్న అపవాదు మూటగట్టుకుంటున్నారని గ్రామానికి చెందిన బాధితుడు చెలుకలపెల్లి నర్సింహస్వామి తెలిపారు. సహ చట్టంతో విషయం వెలుగులోకి వచ్చిందని ఆయన చెప్పారు. మండల కేంద్రంలో విలేకరులతో నర్సింహస్వామి ఆదివారం మాట్లాడారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 555లో చెలుకలపెల్లి నర్సయ్య పేరిట 38 గుంటల భూమి ఉండగా కాస్తు, కబ్జాలో ఉండి 2016 డిసెంబర్‌లో మృతి చెందాడని చెప్పారు. నర్సయ్యకు వారసులు లేకపోవడంతో అతడి సోదరుడి కుమారుడైన తాను అంత్యక్రియలు నిర్వహించినట్లు నర్సింహస్వామి తెలిపారు. ఈ క్రమంలో ముదిరాజ్ కులపెద్దలు, రక్త సంబంధీకులు సదరు నర్సయ్యకు చెందిన 38 గుంటల భూమిని 2017లో తన పేరిట రాయించారని చెప్పారు. ఇదిలా ఉండగా నర్సంపేట మండలంలోని మగ్దుంపురం గ్రామానికి చెందిన నూనె ప్రమీల నర్సయ్య వారసురాలిగా పేర్కొంటూ 38 గుంటల భూమిని పసుపు కుంకుమల కింద ఆమెకు ఇచ్చినట్లు కాగితాల సృష్టించి చెలుకలపల్లి రాజుకు అమ్మినట్లు మరో తెల్లకాగితం రాసుకున్నారని వివరించారు. ఆ రెండు కాగితాలతో తహసీల్దార్ కార్యాలయంలో సాదా బైనామా కింద చెలుకలపల్లి రాజు 2020 అక్టోబర్‌లో దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారులు తిరస్కరించారని చెప్పారు. అనంతరం ఎలాంటి ఆధారాలూ లేకున్నా రాజు పేరు మీద అప్పటి తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్, డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) మధుసూదన్, గిర్దావర్ స్వామి, సిబ్బంది 19 ఫిబ్రవరి 2020న అక్రమంగా వారసత్వ పట్టా మార్పిడిని ధరణి ద్వారా చేశారని తెలిపారు. అలాగే వాస్తవంగా భూమి 38 గుంటలు ఉండగా 1.13 ఎకరాలున్నట్లు రాజు పేరిట భూమి మార్పిడి చేశారని వివరించారు. సదరు వివరాలన్నీ సమాచార హక్కు చట్టం కింద తాను కోరితే రెవెన్యూ అధికారులే ఇచ్చారని చెప్పారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను నిలదీస్తే వారసత్వ పట్టా మార్పిడికి సంబంధించిన ఫైలు కార్యాలయంలో లేదని చెబుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. అక్రమంగా వారసత్వ పట్టా మార్పిడి చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓకు తాను ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా తప్పుడు పట్టా చేసిన ఘటనపై సమగ్ర విచారణ చేసి బాధ్యులైన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని నర్సింహస్వామి కోరారు.

డీజిల్ ట్యాంకర్ బోల్తా

దామెర : డీజిల్ ట్యాంకర్ బోల్తా పడడంతో డీజిల్ నేలపాలైన ఘటన మండలంలోని ఊరుగొండ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్యాంకర్ డీజిల్‌తో హనుమకొండ నుంచి గూడెప్పాడ్‌కు వెళ్తుండగా ఊరుగొండ వద్ద జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

నీట్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

గీసుకొండ : నీట్–2024లో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి మళ్లీ పరీక్ష నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) కాకతీయ విశ్వవిద్యాలయ (కేయూ) కమిటీ కార్యదర్శి మర్రి మహేశ్ ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరీక్షలో చోటు చేసుకున్న లోపాలు బయటకు పొక్కకుండా ఉండేందుకే పార్లమెంట్, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదలైన రోజే నీట్ ఫలితాలు విడుదల చేశారని విద్యార్థులు, తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. తప్పుడు సమాధానాలకు నెగెటివ్ మార్కులు ఉన్నప్పటికీ కొందరికి 718, 719 మార్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ అయ్యిందన్న ప్రచారంపై విచారణ చేయకుండా ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. స్థానిక భాషలో నీట్ పరీక్ష నిర్వహించి దక్షిణాధి రాష్ట్రాల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నాయకులు



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట : పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కాలనీలో ఆ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు, చిన్నారులకు రక్షణ కరువైందని ఆందోళన వెలిబుచ్చారు. నేరస్తుడిని కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మమత, శైలజ, మంజుల, యశోద, అరుణ, పర్వీనా, దివ్య, అమూల్య, శారద పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ధర్నా

ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఏబీఎస్‌ఎఫ్, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఎంఎస్‌ఎఫ్, తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేశ్, గుర్రం అజయ్, దిడ్డి పార్థసారథి, సిద్దు మాట్లాడారు. ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కావ్య, అనిత, రాణి, జ్యోత్స్న, సునీత, స్వప్న, మమత, మోహన్, రాధిక, కావ్యశ్రీ, భవిత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న రాజేశ్, తదితరులు

గీసుకొండ : జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్ కన్నా ఆధ్వర్యంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ కన్నా ఎంపీకి సమస్యలు వివరించారు. నూతన కమిటీ వేసి గత ప్రభుత్వంలో జారీ చేసిన జీఓ నంబర్ 510తో నష్టపోయిన 4 వేల మంది ఉద్యోగులకు వేతనాలు పెంచి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ పుట్ట మహేందర్‌రావు, ఎస్‌హెచ్‌ఎం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నూర సంపత్‌కుమార్, నాయకులు మురళీ, సందీప్, ప్రీతి, వనిత తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించక రైతన్నకు వెతలు



పత్తి మొక్కలకు నీరు పెడుతున్న రైతు

దుగ్గొండి : రోహిణి కార్తె ముగిసిం మృగశిర సగం గడిచినా వరుణుడు సరైన రీతిలో కరుణించక రైతుకు వెతలు తప్పడం లేదు. వర్షాలు ఆశించిన మేరకు కురుస్తాయనే ఆశతో మండలంలోని పలు గ్రామాల్లో అన్నదాతలు దుక్కిలోనే ముందస్తుగా పత్తి విత్తనాలు వేశారు. విత్తనం వేసి 15 రోజులు గడిచింది. అడపాదడపా కురుస్తున్న చిరు జల్లులకు కొన్ని చోట్ల పత్తి విత్తనాలు మొలిచాయి. చాలా చోట్ల భూమిలో విత్తనం అలాగే ఉంది. చినుకు జాడ లేదు. మొలిచిన పత్తి మొక్కలు, వేసిన విత్తనం వృథా కాకుండా కాపాడుకునేందుకు అన్నదాతలు వరుణుడిపై ఆశలు వదులుకుని నీరు పారించే పనిలో పడ్డారు. డ్రిప్ ఉన్న రైతులు పైపులు పరిచి నీరు అందిస్తుండగా ఆ సౌకర్యం లేని అన్నదాతలు నేరుగా నీరు పారిస్తున్నారు. మరి కొందరు రైతులు చేసేదేమీ లేక వర్షం కోసం ఆకాశం వంక ఆశగా చూస్తున్నారు.

యథేచ్ఛగా నల్లమట్టి తరలింపు



టిప్పర్‌లోకి మట్టి తోడుతున్న జేసీబీ



నల్లమట్టిని తరలిస్తున్న టిప్పర్లు

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ఎల్లమ్మ చెరువు నుంచి నల్లమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులున్నాయంటూ మట్టిని ఇటుక బట్టీలకు జేసీబీల సాయంతో టిప్పర్లలో రాత్రింబవళ్లు తరలిస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నుంచి మట్టిని తరలించడాన్ని గ్రామస్తులు ఇటీవల అడ్డుకోగా మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు ఉన్నాయంటూ ఒకరోజు తాత్కాలికంగా మట్టి తరలింపును నిలిపేసి మళ్లీ మరుసటి రోజు నుంచి పెద్ద సంఖ్యలో టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారు. నల్లమట్టి తరలించేందుకు నీళ్లను సైతం తూము గుండా వదిలి ఎండబెట్టారని గ్రామస్తులు మండిపడుతున్నారు. అడ్డూ అదుపూ లేకుండా చెరువులోంచి నల్లమట్టిని మాఫియాను తలపించేలా తరలిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశ్నించిన గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు పలువురు తెలిపారు. ప్రభుత్వం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి నల్లమట్టి తరలింపుపై సమగ్ర విచారణ చేపట్టి పరిమితికి మించి మట్టి తరలించకుండా చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఎల్లమ్మ చెరువు నుంచి నల్లమట్టి తరలించేందుకు రూ.1.20 లక్షలు ఇస్తేనే టిప్పర్లు వెళ్లేందుకు గ్రామస్తులు తీర్మానించారు. ఇందులో లక్ష రూపాయలు గ్రామంలోని రామాలయం అభివృద్ధికి, మిగతా రూ.20 వేలు లీడర్లకు కేటాయించినట్లు గ్రామస్తులు తెలిపారు.

'ముదిరాజ్'తో నామకరణం చేయాలి

నర్సంపేట : సమాజంలోని ముదిరాజ్ కులస్తులకు తగిన గుర్తింపు రావాలంటే ఇక నుంచి పేరు చివర ముదిరాజ్ పదాన్ని జోడించి పిల్లలకు నామకరణం చేయాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆకాంక్షించారు. పట్టణంలో ఆదివారం జరిగిన ఓ శుభకార్యానికి వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దేవేందర్ మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, తదితర అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఐక్యతతోనే కులస్తులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నతంగా ఎదుగుతారని చెప్పారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి మాట్లాడారు. ప్రస్తుతం దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతుండగా ముదిరాజ్ కులస్తులు ఉన్నత చదువులకు దూరంగా ఉంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. పేద ముదిరాజ్ కులస్తుల ఉన్నత విద్య కోసం అసోసియేషన్ తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, డివిజన్ గౌరవ అధ్యక్షుడు పిట్టల కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవి, శ్రీను, నాగేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.